భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 26.0
తణుకు : 30.0 - 26.0


ఫిర్యాదుదారుల గోడు వింటున్న కలెక్టర్ నాగరాణి

విన్నపాలు వినవలె..

ప్రజల సమస్యలను శ్రద్ధతో పరిష్కరించాలి : కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 15 : ప్రజల సమస్యలను శ్రద్ధతో సకాలంలో సానుకూలంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వ్యయ ప్రయాసలకు ఓర్చి తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వస్తుంటారని వాటిని సానుకూలంగా పరిష్కరించాలన్నారు. వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి 129 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, కె.ఆర్.ఆర్.సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి అప్పారావు, అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

కొన్ని వినతులు ఇవీ..

- తన ఇద్దరు కుమారులు తనను మోసం చేసి స్థలం, ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని బయటకు పంపి వేశారని, తనకు ఎటువంటి ఆధారం లేదని న్యాయం చేయాలని పెనుగొండ మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన సుబ్బారావు ఫిర్యాదు చేశారు.
- యలమంచిలి మండలం మేడపాడు గ్రామానికి చెందిన తోట వీరభద్రరావు తన సమస్యను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. పదేళ్ల క్రితం తమకు ఇద్దరు కవల పిల్లలకు పుట్టారని వారికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని డాక్టర్లు తెలిపారని ఏడేళ్ల వయసు వచ్చిన తర్వాత ఒక పాప చనిపోయిందని తెలిపారు. రెండో పాపకి పదేళ్ల వయసు వచ్చిందని పాపకు ఉన్న అనారోగ్యం కారణంగా ఆందోళనగా ఉందని విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందేలా రిఫర్ చేయాలని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కీర్తిని ఆదేశించారు.
- తన భూమికి సంబంధించి సర్వే రిపోర్టు ఇప్పించాలని మొగల్తూరు మండలం శేరేపాలెంకు చెందిన పోతునీడి వెంకటేశ్వరరావు కోరారు. తన భూమి ఆక్రమణకు గురైందని సర్వే చేయించాలని కోరగా మండల సర్వేయర్లు వచ్చి సర్వే చేసి సరిహద్దు భూముల్లో 19 సెంట్లు ఎక్కువగా ఉందన్నారు. అనంతరం సర్వే రాళ్లు పాతారని సర్వే రిపోర్టు ఇవ్వలేదన్నారు.


మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం అధినేత పవన్ కల్యాణ్ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశం నిర్వహించారు. జిల్లాకు చెందిన భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు అంజిబాబు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్‌లను పవన్ సన్మానించిన దృశ్యాలు

మండలాల్లో మహిళా మార్ట్‌లు



నరసాపురంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు

మహిళలు స్వయం ఉపాధి సాధించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలుగుదేశం కూటమి హామీ ఇచ్చింది. మహిళల ఆదాయం పెంచుతామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ప్రకటించారు. ఆ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ప్రతి మండలంలోనూ మార్ట్‌లు ఏర్పాటు చేసి మహిళలే మార్ట్‌లను నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నారు. డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలకు అవకాశం కల్పించనున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 34 వేల సంఘాలున్నాయి. వారందరికీ ఉపాధి మార్గం చూపేలా ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఏర్పాటు దిశగా అధికారుల కసరత్తు
డ్వాక్రా మహిళలకు అవకాశం
దిశానిర్దేశం చేసిన ప్రభుత్వం

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మార్ట్‌లపై చర్యలు తీసుకున్నా సరే ముందడుగు వేయలేదు. ఒక్క నర్సాపురంలోనే ఏర్పాటు చేశారు. అక్కడ ప్రతిరోజు లక్ష రూపాయల మేర వ్యాపారం సాగింది. తర్వాత అధికారులు మార్ట్‌పై దృష్టి పెట్టలేకపోయారు. ఇప్పుడు రోజుకు సగటున రూ. 40 వేలు వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. డ్వాక్రా సభ్యులంతా అక్కడకు వెళ్లి కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. బయట మార్కెట్ కంటే కాస్త తక్కువ ధరకే మార్ట్‌ల్లో సరుకులు లభ్యం కానున్నాయి. జిల్లా పరిధిలో 20 మండలాలున్నాయి. ప్రతి మండల కేంద్రంలోనూ మార్ట్‌లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆదిశగా స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. గతంలో జిల్లాలో నర్సాపురం, పాలకోడేరు, అత్తిలి, పెనుగొండ, తణుకు రూరల్ తదితర మండలాల్లో మార్ట్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. నర్సాపురంలో మాత్రం మార్ట్ ఏర్పాటు చేశారు. మిగిలిన మండలాల్లో డ్వాక్రా సభ్యుల నుంచి పూర్తిస్థాయిలో సొమ్ములు వసూలు చేయలేకపోయారు. ప్రతి సభ్యురాలి నుంచి రూ. 200 వంతున వసూలు చేస్తారు. అంటే ఒక్కో గ్రూపు రూ.2000 చెల్లించాలి. మహిళలు పొదుపు నుంచి లేదంటే రుణాల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయనున్నారు. మార్ట్‌ల్లో పెట్టుబడి పెడతారు. వచ్చిన లాభాలను కూడా అదే మార్ట్‌లో మళ్లీ పెట్టుబడి చేస్తారు. నిర్వాహకులకు వేతనం ఇస్తారు. దీనివల్ల బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే సరుకులు మహిళలకు లభ్యం కానున్నాయి. ప్రతి మార్ట్‌లోనూ కనిష్ఠంగా ఆరుగురికి ఉపాధి లభించనుంది.

పూర్తిగా సొమ్ములు వసూలైన తర్వాతే..

గతంలో వసూలు చేసిన సొమ్ములపై అధికారులు ఇప్పటిదాకా చర్యలు తీసుకోలేదు. ఎన్నికల కోడ్ రావడంతో మార్ట్‌ల వ్యవహారాన్ని పక్కన పెట్టారు. దాంతో రూ. 2000 చెల్లించిన మహిళా గ్రూపులు గుబులు చెందుతున్నాయి. తాము చెల్లించిన సొమ్ములకు భరోసా లేకుండా పోయిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. పూర్తిస్థాయిలో ప్రతి మండలం నుంచి సొమ్ములు వసూలు చేసిన తర్వాత మార్ట్‌లు ఏర్పాటు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్ట్‌లపై కదలిక వచ్చింది. త్వరలో అన్ని మండలాల్లో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తారు.

ప్రభుత్వ ప్రోత్సాహం ఎంత ?

మహిళా మార్ట్‌ల కోసం సభ్యులే పెట్టుబడి పెడుతున్నారు. దాంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు కల్పిస్తే మార్ట్‌లు బలోపేతంగా ఉంటాయి. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు కల్పిస్తే మహిళలకు మరింత ఊరట లభించే అవకాశం ఉంది. తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దానికితోడు డ్వాక్రా సంఘాలు తయారు చేసే వస్తువులను కూడా మార్ట్‌ల్లో అమ్మకానికి పెట్టనున్నారు. తద్వారా డ్వాక్రా సంఘాలకు కూడా ఉపాధి లభించనుంది. ఫలితంగా మహిళలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు. ప్రస్తుతం రుణాలు తీసుకుని అనేకమంది సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు.ఎటువంటి ఉత్పత్తులు తయారు చేయడం లేదు.డ్వాక్రా సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల అమ్మకానికి ఈ మార్ట్‌లు ఉపయోగపడతాయి.ఆ దిశగానూ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మొత్తంపైన మహిళలకు పెద్దపీట వేసే చర్యలను తెలుగుదేశం కూటమి ప్రారంభించింది.


ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న పితాని

రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యండి : ఎమ్మెల్యే పితాని

పెనుమంట్ర, జూలై 15 : రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధికి 20 వేల కోట్ల రూపాయలు విడుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం ఉదయం పోడూరు మండలం కొమ్ముచిక్కాల క్యాంప్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్ల నిర్మాణం చేసే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలని ఆయన కోరారు. 500 కోట్ల రూపాయలతో పి.గన్నవరం-కోడేరు ఎన్‌హెచ్ 216 రోడ్డును అభివృద్ధి పరిచేందుకు, అదేవిధంగా పుచ్చలంక-అనగారలంక కాజ్‌వే వరద ముంపునకు మునిగిపోకుండా బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. లంక గ్రామాలను అనుసంధానం చేయడం ద్వారా రోడ్ల నిర్మాణం చేపట్టాలని పి.గన్నవరం కోడేరు వారధి నిర్మాణం జరిగితే 25 నిమిషాల్లో అమలాపురం చేరుకోవచ్చునని అధికారులకు వివరించారు. పంచాయతీ రాజ్ డీఈ వెంకటరత్నం, మోహన్‌బాబు పాల్గొన్నారు.



వేండ్ర రైల్వే గేటు మూసివేత..

ప్రయాణికులకు అవస్థలు

పాలకోడేరు, జూలై 15: పాలకోడేరు నుంచి వేండ్ర వెళ్లే రహదారిలో వేండ్ర వద్ద ఉన్న రైల్వేగేటును ఎటువంటి సమాచారం లేకుండా మూసివేయడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఆంధ్రజ్యోతి రెవెన్యూ అధికారులను సమాచారం కోరగా రైల్వే అధికారులు సమాచారం పంపించారని ఈ రైల్వేగేటు సోమవారం నుంచి బుధవారం వరకు మూసి వేయనున్నట్టు చెప్పారు. మరమ్మతుల కారణంగా రైల్వేగేటును సోమవారం ఉదయం మూసి వేయడంతో సమాచారం తెలియక చాలామంది గేటు వద్దకు వచ్చి వెనుదిరగాల్సిన పరిస్థితి వచ్చింది.



రథంపై ఊరేగుతున్న శ్రీకృష్ణుడు, సోదరి సుభద్ర, సోదరుడు బలరాముడు

రథంపై జగన్నాథుడు

ఇస్కాన్ ఆధ్వర్యంలో వైభవంగా రథోత్సవం

భీమవరంటౌన్, జూలై 15 : భీమవరం ఇస్కాన్ సంకీర్తన మందిరం ఆధ్వర్యంలో సోమవారం జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకారం చేసిన రథంలో శ్రీకృష్ణుడు, సోదరి సుభద్ర, సోదరుడు బలరాముడుల విగ్రహాలను ఆశీసులు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు పాల్గొని పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. కృష్ణభక్తుల హరేరామ సంకీర్తనలతో రథాన్ని ముందుకు లాగారు. ఇస్కాన్ భీమవరం శాఖ నిర్వాహకుడు వంశీకృష్ణ దాస్ మాట్లాడుతూ జగత్‌కే నాథుడు అయిన శ్రీకృష్ణుడి రథయాత్రను విదేశాల్లో కూడా ఎంతో శోభాయమానంగా జరుపుకుంటున్నారని అన్నారు.



పాఠశాల విద్య దారెటు?

వదలని వైసీపీ ప్రభుత్వ ప్రభావం
గడిచిన రెండేళ్లలో 32,748 మంది ప్రైవేటు బాట
ఈ ఏడాది 2,600 మంది విద్యార్థులు..
ఆంగ్ల బోధన, ట్యాబ్‌లు, నాడు-నేడులో వైఫల్యాలు
అక్కరకు రాని విద్యా విధానాలు
ప్రైవేట్ మేలనుకున్న తల్లిదండ్రులు

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 15 : ప్రభుత్వ విద్యపై గత వైసీపీ ప్రభుత్వ ప్రభావం ఇంకా వదలలేదు. ఐదేళ్లలో పేదలకు విద్యను అందించడంలో విఫలమైంది. ప్రభుత్వ విద్యార్థులు ప్రైవేటు విద్యకు వెళ్లేలా దారిచూపింది. మూడేళ్ళ క్రితం మొదలైన విద్యార్థుల వలస ఈ ఏడాది వరకు కొనసాగింది. విద్యా విధానాల్లో మార్పులు తెస్తామంటూ విద్యార్థులు ఉత్తీర్ణతలో వెనుకబడేలా చేసింది. తల్లితండ్రుల్లో ప్రభుత్వ విద్యంటే భయపడడానికి కారణంగా నిలిచింది.

మూడేళ్లలో 36 వేల మంది బయటకు..

ఆంగ్లభాష, నాడు-నేడు, విద్యార్థులకు ట్యాబ్‌లు అంటూ గత వైసీపీ ప్రభుత్వం నూతన విధానాలను తీసుకువచ్చినా విద్య అందించడంలో విఫలమైంది. దాని పర్యవసనంగా పాఠశాలల్లో విద్యార్థుల తగ్గుదల మొదలైంది. గడిచిన మూడేళ్లలో వైసీపీ అస్తవ్యస్త విద్యా విధానాల కారణంగా 36 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పడులు వదిలి వెళ్లిపోయారు. 2021 విద్యా సంవత్సరం నుంచి మొదలైన విద్యార్థుల వలస ఈ ఏడాది కూడా కనిపించింది. 2021-22 విద్యా సంవత్సరంలో జిల్లాలోని 1352 ప్రభుత్వ పాఠశాలలో లక్ష 38 వేల విద్యార్థులు ఉండగా 2022-23 విద్యా సంవత్సరంలో 1 లక్ష 19 వేలకు చేరింది. 19,832 విద్యార్థులు ఆ ఏడాది ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోయారు. 2023-24 విద్యా సంవత్సరంలో లక్ష 19 వేల 31 మంది విద్యార్థుల నుంచి లక్ష 5 వేల 31 మందికి పడిపోయింది. ఈసారి 13,914 మంది ప్రైవేటు బాట పట్టారు. ఈ విద్యా సంవత్సరం (2024-25) లక్ష 5 వేల 31 మంది విద్యార్థులకు లక్ష 2 వేల 404 మంది ఉన్నారు. అయితే గడిచిన రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది ప్రైవేటుకు వెళ్లినవారి సంఖ్య తక్కువగానే ఉంది. కూటమి ప్రభుత్వం రావడంతో విద్యార్థుల తల్లితండ్రుల్లో కొంత భరోసా వచ్చిందని నిపుణులు చెబుతున్నారు.

నాడు-నేడులో ఇంకా సమస్యలే..

ఈ ఏడాది విద్యా సంవత్సరంలోనూ విద్యార్థుల తరగతి గదులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సెకండ్ ఫేజ్ నాడు-నేడు పనుల్లో అవసరమైన తరగతి గదులు నిర్మించలేదు. బడ్జెట్ కేటాయించినా సొమ్ము చెల్లింపు వచ్చేసరికి అదనపు తరగతి గదుల నిర్మాణం చాలా వరకు నిలిపివేశారు. దీంతో తరగతి గదులు అందుబాటులోకి రాలేదు. 2022లో సెకండ్ ఫేజ్ నాడు-నేడు కింద జిల్లాలో 746 పాఠశాలల్లో అభివృద్ధి పనులకు రూ.261,375 కోట్లు మంజూ చేశా మన్నారు. చివరికి రూ.142.77 కోట్లు ఇచ్చారు. దీంతో విద్యాబోధనకు అవసరమైన సౌకర్యాలు సంపూర్తి కాలేదు.

ప్రైవేటు వైపు వలసలు తగ్గేనా !

వైసీపీ ప్రభుత్వంలో గందరగోళ విద్యా విధానాలతో ప్రభుత్వ పాఠశాలలో విద్యపై నిరాశకు గురైన తల్లితండ్రుల్లో కొత్త ప్రభుత్వం రాకతో ఆలోచన విధానం మారినట్లు కనిపిస్తున్నది. గత ఏడాది అంతకు ముందు ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏడాదికి 15 వేల మంది విద్యార్థులు ప్రైవేటు వైపు వెళ్లారు. ఈ ఏడాది ప్రైవేటు వైపు వెళ్లే విద్యార్థుల సంఖ్య 3 వేలకు తగ్గింది. ఈ లెక్కన వచ్చే ఏడాది ప్రభుత్వ విద్యా విధానాలతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



మారంపల్లి, బి.కొండేపాడు గ్రామాల్లో మునిగిన నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

నీళ్లలో నారుమడులు

ఉధృతంగా ఎర్రకాలువ

వర్షాలకు మునుగుతున్న నారుమడులు, చేలు

ఆచంట /తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు, జూలై 15 : వర్షాలకు ఎర్రకాలువ పొంగి పొర్లుతోంది. తాడేపల్లిగూడెం మండలంలోని జగన్నాధపురం, మాధవరం, మారంపల్లి గ్రామాల్లో వరిచేలు నీటమునిగాయి.వాటితో పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో దండగర్ర, నవాబుపాలెం, మోదుగగుంట, తదితర గ్రామాల్లో వరి నారుమడి, నాట్లు వేసిన పంట చేలు నీటమునిగాయి. మండలంలో 5 హెక్టార్లలో నారుమడులు, 209 హెక్టార్లలో నాట్లు నీటమునిగినట్టు అధికారులు చెబుతున్నారు. నీటమునిగిన వరిచేలను వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీ కృష్ణ, ఏవో ఆర్ఎస్ ప్రసాద్‌లు సోమవారం పరిశీలించారు. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గోదావరికి ఎర్రనీరు

ఆచంట, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలోకి నీరు చేరడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఇప్పటి వరకు తెల్లనీటితో ఉన్న గోదావరి నీటి ప్రవాహంతో ఎర్రనీరు రావడంతో పాటు ఇసుక తిన్నెలతో పాటు ర్యాంప్‌లు కూడా నీట మునిగాయి. ఇప్పటి నుంచి సుమారు మరో రెండు నెలలు పాటు గోదావరి పెరుగుతూ తగ్గుతూ ఉంటుంది.

నీటిని బయటకు మళ్లించుకోవాలి

నారుమడుల నుంచి నీటిని బయటకు మళ్లించుకోవాలని తాడేపల్లిగూడెం డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ మురళీకృష్ణ, ఏవో పార్థసారధిలు రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని పడమరవిప్పర్రు, బి.కొండేపాడు, మీనవల్లూరు, కే.పెంటపాడు తదితర గ్రామాల్లో ముంపునకు గురైన నారుమడులను పరిశీలించారు. ఐదు సెంట్లు ఉన్న నారుమడి మునిగితే రెండు కేజీల యూరియా, కేజీ పొటాషియం చల్లుకోవాలని, నారు మెత్తబడితే బావిష్టన్ 1 గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

నారుమడుల్లో రక్షణ చర్యలు తీసుకోవాలి : కేవీకే శాస్త్రవేత్తలు

ఉండి : వర్షాలకు దెబ్బతిన్న వరిపొలం, నారుమడులను కాపాడుకోవడానికి శాస్త్రవేత్తల సలహాలతో రైతులు తగు చర్యలు తీసుకోవాలని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వినయలక్ష్మీ, బి.రజితలు సూచించారు. సోమవారం ఉండి మండలంలోని యండగండి, ఉప్పులూరు గ్రామాల్లో నారు మడులను పరిశీలించారు. నీట మునిగిన పంటను కాపాడుకోవడానికి పలు సూచనలు అందించారు. నారు మడి దశలో వున్న చేలు, విత్తనం చల్లిన 2,3 రోజుల వయుసుగల నారుమడి 3 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగినట్లయితే మొలకశాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ దశలో వీలైనంత త్వరగా నీటిని బయటకు తీసివేయాలన్నారు. నీరు తీసిన తరువాత 5 సెంట్లులో వేసిన నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకులు వచ్చి నాట్లు వేసేందుకు అందుతాయన్నారు. అధిక వర్షాలకు నారుమడి దశలో తెగుళ్ల బారినపడకుండా నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత ఒక లీటరు నీటికి 1 గ్రాము కార్బెండిజిమ్ లేదా మాంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేయాలని సూచించారు. పిలకదశలో వున్న వరిపొలంలో ముంపునకు గురైతే నీటిని పూర్తిగా తీసివేసి తరువాత పైపాటుగా ఒక ఎకరానికి 80 కిలోల యూరియా 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి చల్లుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు.


గోదావరికి ఎర్రనీరు చేరిన దృశ్యం


ఉండి మండలం ఉప్పులూరులో వరిచేలను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్తలు

కల్కి భగవానునిగా జగన్నాథుడు



ద్వారకా తిరుమల జూలై 15: కల్కి భగవానునిగా జగన్నాథుడు సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా జగన్నాథుడు ఖడ్గాన్ని డాలును ధరించి కల్కి అవతారంలో సాక్షాత్కరించారు. ఈ నెల ఏడో తేదీన ప్రారంభమైన జగన్నాథుని ఉత్సవాలు మంగళవారం రథయాత్రతో ముగియనున్నాయి.

బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సత్య ఉషారాణి

తణుకు, జూలై 15 : ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల చిట్టూరి సుబ్బారావు, సత్య ఉషారాణి బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో నందు జరు గుతున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. అండర్-13 సింగిల్స్‌లో ఎస్.హేమంత్‌శ్రీ (విన్నర్), టి.కౌసిక్(రన్నర్), మెన్ 60 ప్లస్ సింగిల్స్ విభాగంలో ఎ.వంశీ కృష్ణంరాజు, ఆర్. పవన్‌కుమార్ (రన్నర్), ఉమెన్ 50 ప్లస్ డబుల్ విన్నర్ ఎస్. వేషన, యు.పవనిశ్రీ, మెన్ డబుల్స్ విన్నర్ ఆర్.సంజీవరావు, గునా శ్రీఖర్, అండర్ 11 విన్నర్స్ డబుల్స్ టి.కౌసిక్, బి.సూర్య, అండర్-15 విన్నర్ సింగిల్స్ ఎం.మనోజ్ఞ విజేతలుగా నిలిచారు.కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి లో విజేతలుగా నిలవాలని కోరారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు, కళాశాల సెక్రటరీ చిట్టూరి సత్య ఉషారాణి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా సెక్రటరీ మెంటే వంశీకృష్ణ, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కంటిపూడి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.సతీష్, కోచ్ యు.సుదర్శన్, కళాశాల పీడీలు రత్నకుమారి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్‌వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, జూలై 15: కర్నూలులో జరిగిన 9వ జూనియర్, సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌లో ఏలూరు జిల్లా తరపున పాల్గొన్న స్విమ్మింగ్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధించారు. సబ్ జూనియర్ విభాగం లో స్వామినాయుడు నాలుగు బంగారు పతకాలు, రజిత పతకం సాధించగా, జూనియర్ విభాగంలో బి.ధనుష్ రెండు బంగారు పతకాలు, వి.రఘురామ్ రెండు కాంస్య పతకాలు, సబ్ జూనియర్ విభాగంలో ఎండీ సిద్రా, మూడు వెండి, కాంస్య పతకం సాధించారు. సీహెచ్ పూర్వి వెండి పతకం, యశశ్విని వెండి పతకం, టి.శ్రాగ్విత వెండి, బీఆర్‌ఆర్‌వీ భవానీ కార్తీక్ రజత పతకం సాధించారు. సోమవారం కలెక్టర్ కె.వెట్రి సెల్వి, జేసి లావణ్యవేణిను వీరు మర్యాద పూర్వకంగా కలవడంతో వారిని అభినందించారు.

అంబేడ్కర్, పూలే చిత్ర పటాలు ఏర్పాటు చేయాలి

ఏలూరు రూరల్, జూలై 15 : రాష్ట్రంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు కడలి గోపాలరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డీపీవోను తొలిసారిగా కలిసిన నేపథ్యంలో పుష్పగుచ్ఛం అందజేశారు. గోపాలరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన నెలలోపే 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.250 కోట్లు విడుదల చేయటం అభినందనీయ మన్నారు. ఐదేళ్లలో వివిధ పద్దుల కింద వైసీపీ ప్రభుత్వం బకాయిపడిన మిగతా నిధులను త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటు ఆస్పత్రి సీజ్

వేలేరుపాడు, జూలై 15 : వేలేరుపాడులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ, ఇతర అధికారులు సోమవారం సీజ్ చేశారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్ తెలిపిన వివరాలివి.. 2022 డిసెంబర్ 12న ఈ ఆస్పత్రిలో మహిళ మృతి చెందింది. దీనిపై ఆమె భర్త దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆస్పత్రిని సీజ్ చేశాం. అయినా వైద్యుడు కేసగాని శ్రీనివాస్‌గౌడ్ తిరిగి ఆస్పత్రిని ప్రారంభించి వైద్యం చేస్తున్నారు. దీనిపై దుర్గారావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయండతో విచారణ జరపగా లైసెన్స్ రెన్యువల్ లేకుండానే ఆస్పత్రి నడుపుతున్నారని గుర్తించి సీజ్ చేసి, కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. డీఎంఓ నాగరత్నం, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిని ఆగజ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

తాగు నీటికి 54 రకాల పరీక్షలు

పబ్లిక్ హెల్త్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ సుధాకర్

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మంచినీటిని 54 పరీక్షలు చేసి ప్రజలకు సరఫరా చేయాలని పబ్లిక్ హెల్త్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ ఎ.సుధాకర్ తెలిపారు. మునిసిపాలిటీలకు సోమవారం ప్రత్యేక సూచనలు చేశారు. మా సర్కిల్ పరిధిలో రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు కార్పొరేషన్లు, 18 మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంలో పైపు లైన్ల లీకుల వల్ల మంచి నీరు కలుషితమవుతుంది. మంచి నీటిని వ్యాధి కారక లక్షణాలు, ఇతర లోపాలు నిర్ధారించడానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిండిగ్స్ (ఎస్‌వోపీ) గైడ్ లైన్స్‌ను ఈఎన్‌సీ జారీ చేసింది. వాటి ప్రకారం 54 రకాల పరీక్షలు చేయాలి. భూ గర్భ జలాలు, బోరు బావులు, చేతి పంపులు, ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో నెలకోసారి ఈ పరీక్షలు చేయాలి. కెమికల్ విభాగంలో 12 రకాల పరీక్షలు ఉంటాయి. బ్యాక్టీరియా కోలి టెస్ట్ వారానికొకసారి చేయాలి. హెవీ మెటీరియల్ విభాగంలో 21 రకాల పరీక్షలు చేయాలి. పెస్టిసైడ్స్ విభాగంలో 14 రకాల పరీక్షలు మూడు నెలలకోసారి చేయాలి. ఆర్గో క్లోరైడ్స్‌కు సంబంధించిన ఐదు పరీక్షలు ఉంటాయి. వాటిలో మిథైల్ పార్థాన్, మిలాథిన్, క్లోర్పైపోస్, ఈథిన్, మోనోక్రోటోఫస్ వాటి పరీక్షలను మూడు నెలలకు ఒకసారి చేయాలి.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జంగారెడ్డిగూడెం, జూలై 15 : పట్టణంలో తాళం వేసి ఉన్న ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న పులగం విజయ్ అయ్యప్ప టౌన్‌షిప్‌లో నివసిస్తున్నారు. విజయ్ కుమార్తె అనారోగ్యం తో ఉండడంతో ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళారు. అక్కడ పని ముగించుకుని సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు పట్టణంలోని తన ఇంటికి వచ్చే సరికి ఇంటి ముఖ ద్వారం తాళం పగలగొట్టి ఉందని లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరచి లాకరులో ఉన్న బంగారు వస్తువులు, వెండి పట్టీలు, కొంత నగదు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయారని బాధితుడు విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

లాభాల పంట రూప్‌చంద్



ఆక్వా రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. కూటమి ప్రభుత్వం రాకతో మార్కెట్లో చలనం కలిగి ఎన్నడూ లేని విధంగా జూలైలో అత్యధిక ధర పలకడం రైతులు ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. సాధారణంగా రూప్‌చంద్ మార్కెట్ జనవరి నుంచి మే వరకు అత్యధిక ధర పలుకుతుంది. జూన్, జూలై నెలలో సముద్రం చేపలు సమృద్ధిగా లభించడంతో ఈ కాలంలో రేటు తక్కువగా ఉంటుంది. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వ ఏర్పాటుతో రైతులకు లాభం చేకూరేలా ధర పెరగడం మంచి రోజులు వచ్చాయని అభిప్రాయపడుతున్నారు.

» చేపల మార్కెట్లు కళకళ » కేజీ ధర రూ.114 » ఆనందంలో రైతులు

నిడమర్రు జూలై 15: మార్కెట్‌లో అసాధారణంగా రూప్‌చంద్ రేటు, అటు శీలావతి రేట్లు పెరగడంతో చేపల మార్కెట్లు కళకళలాడుతున్నాయి. సాధరణంగా కేజీ రూపచంద్ తయారీకి రైతుకు అన్నీ కలిపి రూ.90 నుంచి రూ.95 వరకు ఖర్చవుతుంది. నేడు మార్కెట్‌లో ధర పెరగడంతో కేజీ చేప ధర రూ.114 పలకడంతో రూ.15 నుంచి రూ.20లు రైతుకు గిట్టుబాటు అవుతుంది.

గత ప్రభుత్వ హయాంలో అంతా నష్టమే

గత వైసీపీ హయాంలో ప్రభుత్వ విధానాల కారణంగా చేపల మేత ధరలు అమాంతం పెరిగాయి. ఓ పక్క అధిక విద్యుత్ ధరల భారం ఇతర ఖర్చులు పెరిగిపోవడంతోపాటు మార్కెట్ ట్రేడర్ చేపల ధరలు తగ్గించి కొనుగోలు చేసేవారు. కంపెనీల తరుపున అనధికారికంగా అప్పటి అధికార పార్టీ పెద్దలకు మామూళ్లు సమర్పించాల్సి రావడంతో మార్కెట్ రేటు బాగున్నా రైతుకు గిట్టుబాటు ధరను ట్రేడర్స్ ఇవ్వలేకపోయేవారు. నేడు కూటమి ప్రభుత్వం రాకతో మామూళ్ల బెడద తొలగిపోవడం, ట్రేడర్స్ స్వేచ్ఛగా వ్యాపారాలు చేస్తుండడంతో రైతుకు మార్కెట్ ధరనే ఇస్తున్నారు. దీంతో రైతుకు అధిక ధర రావడంతో లాభాల బాట పట్టారు.

తగ్గిన రూప్‌చంద్ సాగు

గత ప్రభుత్వ విధానాల వల్ల రూప్‌చంద్ సాగు పూర్తిగా తగ్గిపోయింది. పది ఎకరాలకన్నా ఎక్కువ ఉన్న చెరువులకు ఆక్వా విద్యుత్ సబ్సిడీ లేకపోవడంతో బిల్లులు వేలాది రూపాయలు రావడంతో రైతులు బెంబేలెత్తి తమ చెరువులను చిన్న చెరువులుగా చేసి రొయ్యల సాగు చేయడం ప్రారంభించారు. కానీ రొయ్యల సాగు కూడా తీవ్ర నష్టాలు రావడంతో ముందుకు సాగలేక చతికిల పడ్డారు. దీంతో రూప్‌చంద్ చెరువుల సాగు పూర్తిగా తగ్గిపోయింది. దీనికి తోడు చేప ధర కూడా లేకపోవడంతో చెరువుల సాగు తగ్గించేశారు. చాలామంది తమ చెరువులను అయిన కాడికి లీజులకిచ్చి చేతులు దులుపుకొన్నారు. నేడు ప్రభుత్వ విధానాలు మారడం, తదనంతరం చేపల ధరలు పెరగడంతో మళ్లీ పాత రోజులు వచ్చాయని ఆశపడుతున్నారు. ఆక్వాకు పూర్వ వైభవం వస్తోందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సాగు ఇలా..

- చేపల సాగు చెరువులు : సుమారు లక్షన్నర ఎకరాలు
- రొయ్యల సాగు చెరువులు : సుమారు 2.25 లక్షల ఎకరాలు

మార్కెట్‌లో నిలకడ వచ్చింది



గత ప్రభుత్వ హయాంలో కొన్ని విధాన పర లోపాల వల్ల ఆక్వా రంగం పూర్తిగా దెబ్బతింది. చేపల సాగు చేసిన రైతులు కూడా నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. కానీ నేడు నూతన ప్రభుత్వంలో మార్కెట్‌లో నిలకడ వచ్చి చేపల రేట్లు ఎన్నడూ లేనంతవిధంగా పెరగడంతో రైతు లాభాల బాట పట్టాడు. కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు అన్ని రకాలు ఉంటుందని ఆశతో ఉన్నాం.

- పాతూరి కృష్ణం రాజు, ఆక్వా రైతు, ఫత్తేపురం

ఆనందంగా ఉంది



నేను ఆక్వా సాగు చేసినప్పటి నుంచి ఎన్నడూ జూలైలో ఈ రేటు చూడలేదు. రూప్‌చంద్ కు మే నెలలో పలికే ధర జూలైలో రావడం ఆనందంగా ఉంది. రైతు పది టన్నులకు సుమారు రూ.లక్ష పైనే లాభం వస్తుంది. చికితిపోయిన ఆక్వా రంగాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోని అండగా ఉంటుదని ఆశగా ఉన్నాం. చేపల సాగు లాభాల బాట పట్టడం శుభసూచకం.

- పైడికొండల శివాజి, ఆక్వా రైతు, అడవికొలను

అమ్మో పాము



1917 జూలై 16న జింబాబ్వే దేశంలో మొదటిసారిగా పామును గుర్తించారు. 1929లో పాము విష పూరితమైనదని గుర్తించారు. అప్పటి నుంచి ఏటా ఇదే రోజున పాముల దినోత్సవం జరుపుకుంటూ ప్రజలకు పాములపై అవగాహన కల్పిస్తుంటారు.

» ఉమ్మడి జిల్లాలో ఎనిమిది విషపూరిత జాతులు
» గతేడాది 300 పాము కాట్లు.. 80 మంది మృత్యువాత
» బాధితుల్లో ఎక్కువ మంది రైతులే.. నేడు ప్రపంచ పాముల దినోత్సవం



జంగారెడ్డిగూడెం, జూలై 15 : పాము.. ఈ పేరు వినగానే చాలా మంది భయపడతారు. నేరుగా చూస్తే అమ్మో అంటారు. అదే మన పక్క నుంచి వెళితే ఇంకేమైనా వుందా ? గుండెలు గుబేల్‌మంటాయి. సాధారణంగా పామును చూసి మనం ఎంత అలా భయపడతామో, అవి కూడా మనుషులను చూసి అంతే భయపడతాయి. అలా భయపడి కంగారులో వాటిని రక్షించుకునే క్రమంలో కాటు వేస్తుంది తప్ప పగపడుతుందనడంలో నిజం లేదు. పాములు పర్యావరణ పరిరక్షణలోను, పంటలను రక్షించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. సమస్త జీవ రాశులలోను ఇవి కూడా ఒక భాగమే. నిజానికి మానవ జాతికి పాములు చేసే హానికంటే మేలే ఎక్కువ. పంట పొలాల్లో ఎలుకలు చేసే పంట నష్టం అంతా ఇంతా కాదు. ఈ నష్టం నుంచి పాములు రైతుకు ఎంతో ఉపయోగపడతాయి. కలుగుల్లో దాగివున్న ఎలుకలను పాములు ఆహారంగా స్వీకరిస్తాయి. అలాగే పాము విషయం ఎన్నో ప్రాణాంతక వ్యాధులకు మందులను తయారు చేస్తున్నారు. ఆ విధంగా మనుషులకు పాములు ఉపయోగపడుతున్నాయి. ప్రపంచంలో 3,789 జాతులున్నాయి. దేశంలో 740 పాము జాతులు వుండగా వీటిలో అత్యంత ప్రమాదకరమైన, విషపూరితమైనవి 72 మాత్రమే. అదే ఉమ్మడి జిల్లాలో ఎనిమిది విషపూరితమైన పాములున్నాయి. వీటిలో నాలుగు పాములు షావ్ కిల్డ్ వైపర్, బేంబో పిట్ వైపర్, కింగ్ కోబ్రా, మల బార్ పిట్ వైపర్ అటవీ ప్రాంతాల్లో మాత్రమే ఉంటాయి. రక్త పింజర, తాచు పాము, పొడ పాము, కట్ల పాము మనుషుల మధ్య సంచరిస్తాయి. వీటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

300 పాము కాట్లు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏటా మూడు వందలకుపైగా పాము కాటు కేసులు నమోదవుతున్నాయి. వీటిలో సుమారు 80 మంది వరకు మృత్యువాత పడుతున్నారు. వీరిలో రైతులే ఎక్కువగా ఉంటున్నారు. వర్షాకాలంలో అధిక పాము కాటు కేసులు నమోదవుతాయి కాబట్టి రైతులు పొలాల్లోకి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి పూట తప్పనిసరిగా టార్చిలైట్ తీసుకువెళ్ళాలి. కాళ్ళకు బూట్లు ధరించాలి. ప్రమాదవశాత్తు పాము కాటుకు గురైతే ఆందోళనకు గురికాకుండా త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తీసుకువెళ్ళాలి. యాంటీ స్నేక్ వీనమ్ (ఏఎస్‌వీ) వేయించుకోవాలి. ఇలా చేయడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఇది అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో వుంది.

పాములపై అవగాహన కలిగించాను

పాములను చంపకుండా వాటి నుంచి మనలను మనం ఎలా రక్షించుకోవాలో 500 గ్రామాలు తిరిగి యాభై వేలకు పైగా ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కలించాను. 2016లో స్నేక్ సేవియర్ సొసైటీ స్థాపించి ఇప్పటి వరకూ 19 వేల పాములను పట్టి అడవిలో విడిచిపెట్టాను. పాము జాతులు అంతరించకుండా నిరంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ఉం టాను. ప్రమాదవ శాత్తు పాము కాటు వేస్తే కాటు కు గురైన వ్యక్తి భయపడకుండా ఉండాలి. నడవ డం గానీ, పరుగెత్తడం గానీ చేయకూడదు. ఒత్తిడి కి గురి కాకుండా సకాలంలో ఆసుపత్రికి తీసుకుని వెళ్లిన వెంటనే యాంటీ వీనమ్ వ్యాక్సిన్ తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడ వచ్చు.

- చదలవాడ క్రాంతికుమార్,
స్నేక్ సేవియర్ సొసైటీ వ్యవస్థాపకుడు

నిలిచిన పర్యాటక బోట్లు



పోలవరం జూలై 15 : పాపికొండల పర్యటన బోట్ల రాకపోకలు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు ఏపీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ ఆర్.గంగబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ పరిస్థితులు వర్షాభావంగా ఉండడం, గోదావరి వరద ఉధృతి పెరగడం వల్ల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టూరిజం బోట్ల రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా అధికారుల ఆదేశానుసారం వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత బోట్ల రాకపోకలు పునరుద్ధరించడం జరుగుతుందన్నారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరంలో గోదావరి నీటి మట్టం సోమవారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదుల నుంచి గోదావరిలో వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో నీటి మట్టం రెండు రోజులుగా పెరుగుతోంది. స్పిల్ వేలోకి వస్తున్న జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడంతో ఇక్కడ సాధారణ నీటి మట్టం నమోదైంది. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 27.100 మీటర్లు, స్పిల్వే దిగువన 17.200 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 27.200 మీటర్లు, దిగువన 16.300 మీటర్లు నమోదైనట్లు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

5,310 క్యూసెక్కుల జలాలు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 5,310 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటి మట్టం 15.777 మీటర్లకు చేరుకుం దని, 15 మోటార్లతో 15 పంపుల నుంచి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 5.7469 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యం

పాలకోడేరు, జూలై 15: తల్లీ బిడ్డలు ఆరోగ్యంపై వైద్య సిబ్బంది జాగ్రత్త తీసుకోవాలని జిల్లా గణాధికారి సబరేశ్వరప్రసాద్, డీపీహెచ్‌ఎన్‌ఓ వెంకటరత్నం తెలిపారు. పాలకోడేరు పీహెచ్‌సీ పరిధిలోని గొరగనమూడి ఉప ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య శాఖాధికారులు సోమవారం వారు తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీలోని జనన మరణ రిజిస్టార్లు తనిఖీ చేశారు. ఎల్‌డీ కంప్యూటర్ భాస్కరరావు, డాక్టర్ లీలాలక్ష్మి, సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు శంకర్, నాగమణి, గొరగనమూడి ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

భీమవరం క్రైం, జూలై 15 : భీమవరంలో పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న యువకుడు బైక్ అదుపు తప్పడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంప గ్రామానికి చెందిన ఇంటి సత్యసూర్యప్రకాష్(27) 14వ తేదీ రాత్రి భీమవరంలో పని ముగించుకుని ఇంటికి వెళుతూ బేతపూడి పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లే సరికి బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి ముత్యాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ హెచ్‌సీ మహేష్ తెలిపారు.

పెట్రోలు లీకై బైక్ దగ్ధం



జంగారెడ్డిగూడెం, జూలై 15 : జల్లేరు వద్ద తల్లాడ-దేవర పల్లి జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా అతని ద్వి చక్ర వాహనంలోని పెట్రోలు లీకై పూర్తిగా దగ్ధమైంది. ఖమ్మం జిల్లా దుమ్ముగూడెం మండలం చింతగొమ్ముకి చెందిన కుంజా వీరా స్వామి తన ద్విచక్ర వాహనంపై జంగారెడ్డి గూడెం వైపుగా వస్తున్నాడు. జల్లేరు వద్దకు వచ్చే సరికి జంగారెడ్డి గూడెం నుంచి అశ్వారావుపేట వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం వీరాస్వామి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వీరాస్వామి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో 108 లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు. జంగారెడ్డిగూడెం పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మొగల్తూరు/నరసాపురం రూరల్, జూలై 15 : పేరుపాలెం బీచ్‌లో ఆదివారం గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైందని ఏఎస్ఐ రాజేందర్ సోమవారం తెలిపారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన పాటి పురుషోత్తం(19) స్నేహితులు మొల్లేటి దుర్గాప్రసాద్, గుంటూరి హరిప్రసాద్, మొల్లేటి మున్నా, గుబ్బల బాబి, గుబ్బల విజయ్‌తో కలిసి పేరుపాలెం బీచ్‌కు వచ్చి సరదాగా గడిపి, సముద్ర స్నానం చేస్తుండగా అలల ఉధృతికి పురుషోత్తం గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు తీరంలో గాలింపు చర్యలు చేపట్టగా నరసాపురం మండలం పీఎం లంక వద్ద మృతదేహం తీరానికి కొట్టుకువచ్చింది. కుటుంబ సభ్యులు పురుషోత్తంగా గుర్తించడంతో మృతుని స్నేహితులు మొల్లేటి దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ రాజేందర్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల్ని ఎమ్మెల్యే నాయకర్, ఇంచార్జి పొత్తూరి రామరాజు పరామర్శించి సంతాపం తెలిపారు.

ప్రేమ విఫలం.. యువకుడి ఆత్మహత్య



ఎం.రవితేజ(ఫైల్)

యలమంచిలి, జులై 15: ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెంది మొగల్తూరు గ్రామానికి చెందిన మేడిచర్ల రవితేజ(22) చించినాడ బ్రిడ్జి వద్ద గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. రవితేజ కొన్ని రోజులుగా ఆచంటలో అతని మేనమామ ఇంటి వద్ద ఉంటున్నాడు. మేనమామకు శనివారం నరసాపురం వెళుతున్నానని చెప్పాడు. రవితేజ నరసాపురంలోని స్నేహితులను కలిసి మద్యం సేవించి సెల్ వారి వద్ద వదలి వెళ్లిపోయాడు. అయితే మేనమామ ఇంటి వద్ద ఉన్నాడని తల్లిదండ్రులు, ఇంటికి వెళ్లిపోయి ఉంటాడని మేనమామ కుటుంబ సభ్యులు భావించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చించినాడ బ్రిడ్జిపై బైక్ ఉండటం, అక్కడ ఎవరూ లేకపోవడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బైక్ వివరాల ఆధారంగా రవితేజ తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వారు అతని సెల్‌కు ఫోన్ చేయగా, ఫోన్ తమ వద్ద వదిలేసి వెళ్లాడని స్నేహితులు చెప్పారు. బ్రిడ్జిపై ఉన్న బైక్ రవితేజదిగా అతని కుటుంబ సభ్యులు నిర్ధారించడంతో అతని ఆచూకీ కోసం పోలీసులు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం రవితేజ మృతదేహం గోదావరిలో లభ్యమైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంట్లో గొడవలు.. మహిళ ఆత్మహత్య



వద్ది భవాని (ఫైల్)

భీమవరం క్రైం, జూలై 15 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భీమవరం వన్ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు.. రామాయణం సుబ్బన్నతోటకు చెందిన చిలుకోటి వెంకటరమణ నాలుగో కుమార్తె వద్ది భవాని (30)ను నాలుగేళ్ల క్రితం వద్ది శ్రీనుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి రెండేళ్ల పాప కూడా ఉంది. అయితే భవాని సచివాలయ పోలీస్‌గా 14వ వార్డులో పనిచేస్తోంది. భవాని భర్త శ్రీను మేనత్తకు ఆపరేషన్ చేయడంతో చూడటానికి వెళ్లాడు. దీంతో భవానికి ఆమె భర్త శ్రీనుకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ నెల 14న శ్రీను చర్చికి వెళ్లి వచ్చిన అనంతరం మరలా ఇద్దరి మధ్య తగాదాలు జరగడంతో భవాని తండ్రి వెంకటరమణ ఇద్దరిని మందలించి భవాని కుమార్తెను తనతోపాటు తీసుకువెళ్లగా, శ్రీను బయటకు వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటల సమయంలో శ్రీను ఇంటికి వచ్చి తలుపులు కొట్టినా తీయకపోవడంతో కిటికీ లోంచి చూసేసరికి భవాని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే స్థానికులు, బంధువుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టగా అప్పటికే భవాని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహానికి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాపం పసివాళ్లు

పసివాడి ప్రాణం తీసిన ఆవేశం

చింతలపూడి, జూలై 15:లింగపాలెం మండలం పాశ్వానగరంలో సోమవారం ఒక కుటుంబంలో జరిగిన గొడవ పసివాడి ప్రాణాలు తీసింది. చింతలపూడి సీఐ సుధాకర్ తెలిపిన వివరాలివి.. జార్ఖండ్‌లో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న చల్లపాటి బాలాజీ తన భార్యతో విడాకుల కేసులో కోర్టు వాయిదాకు వచ్చారు. పనిచూసుకుని వెళుతూ బాలాజీ భార్యను, మామను కొట్టడంతో వారు గాయాలపాలయ్యారు. వారు చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి వెళ్లారు. బాలాజీ అక్కడ నుంచి పాశ్వానగరంలోని మామ ఇంటికి వచ్చి అక్కడ ఉన్న ఇద్దరు మరదళ్లను, అత్తను కర్రతో తీవ్రంగా కొడుతుండగా, కర్ర అక్కడే ఉన్న మరదలి 36 రోజుల కొడుక్కి తగలడంతో ఆ బాలుడు మరణించాడని సీఐ తెలిపారు. విషయం తెలిసిన గ్రామస్తులు బాలాజీకి దేహశుద్ధి చేశారని, అతని చికిత్స నిమిత్తం ఏలూరు తరలించగా, పసికందును పోస్టుమార్టంకు చింతలపూడి తరలించామన్నారు. ధర్మాజిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

రోడ్డు పక్కన శిశువు మృతదేహం

జంగారెడ్డిగూడెం, జూలై 15: పట్టణంలో సోమవారం అమానవీయ సంఘటన జరిగింది. ఏరియా ఆస్పత్రికి కూత వేటు దూరంలో నిండా నెలలు నిండని మగ శిశువు మృతదేహాన్ని రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తులు పారవేశారు. ఉదయం పారిశుధ్య కార్మికుడు రేలంగి వెంకటేశ్వరరావు తన పనిలో భాగంగా అటు వెళ్లగా శిశువు మృతదేహాన్ని చూశాడు. విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లగా వీఆర్వో సవలం శ్రీరాములు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శిశువు మృతదేహానికి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం స్థానిక శ్మశాన వాటికలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఖననం చేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ద్వారకా తిరుమల, జూలై 15: అదనపు కట్నం కోసం ఓ వివాహితను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్న భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. రామసింగవరంనకు చెందిన బూర్ల అనూషకు తాడేపల్లిగూడెం మండలం కూనవరంనకు చెందిన బూర్ల శ్రీనుతో ఎనిమిదేళ్ల క్రితం వివాహంకాగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా చెడు వ్యసనాలకు బానిసైన శ్రీను భార్య అనూషను హింసిస్తున్నాడు. దీనిని శ్రీను తల్లిదండ్రులు, సోదరుడు ప్రోత్సహిస్తున్నట్లు అనూష కేసు పెట్టడంతో బూర్ల శ్రీను, నాగేశ్వరరావు, సూరమ్మ, సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయం చేయాలని బాధితురాలి ఆందోళన

దండేపల్లి, జూలై 15: అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తూ భర్తను తన నుంచి వీడదీస్తున్నారని ఓ యువతి సోమవారం మండల కేంద్రంలోని ఆడపడుచు ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరంనకు చెందిన సౌజన్య తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొండాపూర్‌కి చెందిన ఇప్ప ప్రవీణ్ కుమార్‌తో 2013లో ప్రేమ పెళ్లి చేసుకుంది. వీరికి పదేళ్ల కుమారుడు ఉన్నాడు. తన భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని, అందుకు ఆడపడుచు మౌనికే కారణమని ఆమె ఇంటి ఎదుట బాధితురాలు సౌజన్య కుమారుడితో న్యాయం చేయాలని ఫ్లెక్సీతో ఆందోళనకు దిగింది. ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌ను వివరణ కోరగా 2023లో ఏలూరు జిల్లా చేబ్రోలు పోలీసుస్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదైందన్నారు. రెండు చోట్ల కేసులు నమోదు చేయలేమని, బాధితురాలితో మాట్లాడి నచ్చజెపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆమెకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు



ఆచంట, జూలై 15: రెండు సంవత్సరాలుగా ఎక్కడ చూసినా మురుగు డ్రెయిన్‌లలో గుర్రపుడెక్క, చెత్త చెదారంతో పేరుకు పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గుర్రపు డెక్క తొలగింపు చర్యకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఆచంట మండలంలో మురుగు డ్రెయిన్‌లలో గుర్రపు డెక్కను తొలగింపుకు స్ప్రే చేస్తున్నారు. అయితే తూతూ మంత్రంగా కాకుండా పూర్తిస్థాయిలో స్ప్రే చేసి గుర్రపుడెక్కను తొలగించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

నిలిచిపోయిన భవనాల పునర్నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఆచంట, జూలై 15: గత ప్రభుత్వంలో సగంలో నిలిచిపోయిన భవనాలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పునర్‌నిర్మాణం నిమిత్తం పనులు ప్రారంభిస్తున్నారు. సోమవారం కరుగోరుమిల్లిలో మధ్యలో నిలిచిపోయిన సచివాలయం, ఆర్‌బీకే భవనాలు పునర్ నిర్మాణానికి జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, సర్పంచ్ అల్లం పద్మావతి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. వీటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గతంలోనే సచివాలయానికి రూ. 43.6 లక్షలు, ఆర్‌బీకే భవనానికి రూ. 23.9 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ చేస్తున్న ఏపీడీ సురేష్‌బాబును నిలదీస్తున్న ఉపాధి కూలీలు

పెనుగొండ, జూలై 15: ములపర్రు గ్రామంలో ఉపాధి హామీ పని పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడ్డారని టీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం తణుకు ఏపీడీ పి. సురేష్‌బాబు ములపర్రు పంచాయతీ వద్ద విచారణకు వచ్చారు. దీంతో మేట్‌లు, ఉపాధి కూలీలు అక్కడకు చేరుకుని ఫీల్డ్ అసిస్టెంట్ అయిన పితాని వీర వెంకట సత్యనారాయణ అవినీతికి పాల్పడే వ్యక్తి కాదని అతన్నే కొనసాగించాలని ఏపీడీని కోరారు. ఈ విషయంపై ఏపీడీ మాట్లాడుతూ నాలుగు అంశాలపై అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని వాటి నిమిత్తం తాము విచారించామని తెలిపారు. వారు చెప్పిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని చెప్పారు.

కవితల పోటీల్లో విజేత డాక్టర్ బాల చందర్



పెనుగొండ, జూలై 15: కావ్యలహరి సాహితి వేదిక ఆధ్వర్యంలో యోగ - జీవన భాగం అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీల్లో ప్రముఖ కవి రచయిత తెలుగు శాఖాధిపతి డాక్టర్ బాల చందర్ సాదే విజేతగా నిలిచారు. సంస్థ గౌరవాధ్యక్షుడు పొట్లూరి హరి కృష్ణ, కావ్యలహరి అధ్యక్షురాలు కల్పన దేవసాని, నిర్వాహకులు నల్లా నాగ సూర్య వరలక్ష్మిలు బాల చందర్‌ను ఉత్తమ విజేతగా ఎంపిక చేసి ప్రశంసాపత్రం అందజేశారు. ఆదివారం రాత్రి తెలుగు వెలుగు సాహిత్య వేదిక జూమ్ వేదికగా నిర్వహించిన 'రా గోడలు బద్దలు గొట్టుకుని' అనే అంశానికి తాను రాసిన నేలను చీల్చిన విత్తు ఎత్తునకు ఎదగలేదా అనే గేయ కవిత ఉత్తమ కవితగా ఎంపికైనట్లు తెలిపారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ



లబ్ధిదారులకు కిట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రంశెట్టి

పోడూరు, జూలై 15: నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఉజ్వల గ్యాస్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పాలకొల్లు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు కోరారు. వేడంగిపాలెంలో సోమవారం జరిగిన హెచ్‌పీ గ్యాస్ 50వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలోని 81మంది పేదకుటుంబాలకు ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. పోడూరు శ్రీసీతారామా గ్యాస్‌ఏజెన్సీ ప్రతినిధి పసుమర్తి లక్ష్మీనారాయణ గ్యాస్ వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన పద్మపార్వతీ శారద, రామారావు, కూటమి నాయకులు పూతినీడి రంగారావు, నయినాల బాబులు, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

తణుకు, జూలై 15: అనాథ వృద్ధురాలి మృతదేహానికి తణుకు పట్టణానికి చెందిన అమ్మ బ్లడ్ ఆర్గనైజేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కొద్ది రోజులుగా రైల్వే స్టేషన్‌లోనే ఉన్న ఆమె ఆరోగ్యం బాగుండకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించింది. ఆమె బంధువులెవరూ రాకపోవడంతో తమ ట్రస్టు ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేసినట్లు బీజేపీ తణుకు పట్టణ ప్రధాన కార్యదర్శి బొల్లాడ నాగరాజు తెలిపారు. ట్రస్టు వ్యవస్థాపకులు రాము తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించాలి



పెంటపాడు, జూలై 15: బడి ఈడు పిల్లలందరినీ తప్పని సరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోలు శ్రీనివాస్, టీవీ రామకృష్ణ అన్నారు. సోమవారం దర్శిపర్రు గ్రామంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. హెచ్‌ఎంలు కేవీ సత్యనారాయణమూర్తి, నారాయణ, రమణ, సీఆర్‌పీ చిట్టెమ్మ పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం



తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 15: పట్టణంలోని ఒకటో వార్డులో రూ. 33 లక్షలతో సీసీ రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పనులను పరిశీలించిన జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, 1వ వార్డు జనసేన ఇన్‌చార్జి చాపల రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే రూ. 10 కోట్ల వ్యయంతో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధి పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. కేశవభట్ల విజయ్, బయనపాలెపు ముఖేష్, లోవరాజు తదితరులుపాల్గొన్నారు.



భీమవరం బార్ ఎన్నికల్లో ఎన్నికైన సభ్యులు

భీమవరం బార్ అధ్యక్షుడిగా యోహాన్

భీమవరం క్రైం, జూలై 15 : ఎంతో ఉత్కంఠగా సాగిన భీమవరం బార్ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఏలేటి యోహాన్ (న్యూటన్) ఎన్నికయ్యారు. ప్రత్యర్థి డీవీకే ప్రకాష్‌పై 88 ఓట్లు తేడాతో గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా కంచిరాజు వెంకట్రావు గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా అడపాల ప్రసన్నకుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఆర్‌హెచ్‌ఎన్‌వీ సత్యనారాయణ (హరి) గెలుపొందారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా బండారు శ్యామల, ఎన్.చంద్రశేఖర్‌బాబు (వంశీ) గెలుపొందారు. ఎన్నికల అధికారిగా మాగంటి శివ వ్యవహరించారు.





ఉండిలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును సన్మానిస్తున్న పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి, లయన్స్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి.. అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌ను కలసిన ఎమ్మెల్యే నాయకర్.. మంత్రి నిమ్మలను కలసిన మాజీ ఎమ్మెల్సీ అంగర తదితరులు

హాస్టల్స్ అభివృద్ధికి చర్యలు: ఎమ్మెల్యే రఘురామ

ఉండి జూలై 15:నియోజకవర్గంలోని ప్రభుత్వ హాస్టల్స్ అభ్యున్నతికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం ఉండి గ్రామంలోని సంతమార్కెట్ ప్రాంతంలో బీసీ బాలుర కళాశాల వసతి గృహాన్ని, ఎస్‌సీ ఏరియాలో బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. హాస్టల్స్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టాయ్‌లెట్స్, డోర్స్, డ్రైయినేజీ, ఫ్లోరింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు.

- ఉండిలో ఆబ్బాయిరాజు పార్కును సుందరంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే అన్నారు. వారం రోజుల క్రితం పార్కు వద్ద ఆక్రమణలను అధికారులు తొలగించడంతో ఎమ్మెల్యే విచ్చేసి పరిశీలించారు. కుటుంబాలతో పిల్లలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి, ఎంపిటీసీ కునుకు రమాదేవి, ముదునూరి కృష్ణంరాజు, మంతెన సాయిలచ్చిరాజు, కరిమెరక శ్రీను పాల్గొన్నారు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉభయగోదావరిజిల్లాల్లో జనసైనికుల పాత్ర ప్రధానమైనదని ఎమ్మెల్యే రఘు రామకృష్ణంరాజు అన్నారు. సోమవారం ఉండిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే రఘురామ మాట్లాడుతూ ఉండిలో తాను అత్యధిక మెజార్టీ సాధించడంలో కీలకపాత్ర పోషించిన జనసేనసైనికులకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర జనసేన పీఏసీ సభ్యుడు వేగేశ్న కనకరాజు సూరి, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాలరత్నం ప్రసంగించారు. ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.
- ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును వాండ్రం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి, ఉండి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వాండ్రం సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను కలసిన అంగర

పాలకొల్లు అర్బన్, జూలై 15 : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును అమరావతిలోని ఆయన కార్యాలయంలో కలిసి పలు అంశాలపై చర్చించినట్టు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తెలిపారు. అలాగే రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్‌ను, అనపర్తి ఎమ్మెల్యేగా విజయం సాధించిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలిసి అభినందించినట్టు అంగర తెలిపారు. తనతో పాటు మాజీ ఎంపీపీ బొర్రా కృష్ణ, బీసీ నాయకుడు దాసరి అప్పన్న, కృష్ణవేణి దంపతులు ఉన్నారని తెలిపారు.

మత్స్యకార గురుకుల స్కూల్ ఏర్పాటు చేయాలి

నరసాపురం, జూలై 15: తీర ప్రాంతంలో మత్స్యకార గురుకుల పాఠశాలను, బాలికలకు బీసీ రెసిడెన్సీ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని సోమవారం విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే నాయకర్ విన్నవించారు. అమరావతిలో లోకేశ్‌ను కలిసి టీడీపీ హయాంలో మంజూరైన మత్స్యకార గురుకుల పాఠశాలలను గత ప్రభుత్వం పట్టణానికి తరలించిందన్నారు. దీని వల్ల మత్స్యకార విద్యార్థులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. బీసీ బాలికల గురుకుల పాఠశాలకు స్థలం కేటాయించాలని కోరారు.



మండల సమాఖ్య సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జీవనోపాధి కార్యక్రమాలు నిర్వహించాలి: కలెక్టర్

పాలకోడేరు, జూలై 15: మహిళా సమాఖ్య ద్వారా ప్రజలకు ఉపయోగపడే జీవనోపాధి కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి కుటుంబాలు మెరుగుపడే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. పాలకోడేరులోని మహిళా సమాఖ్య బిల్డింగులో సోమవారం జిల్లా మహిళా సమాఖ్య సమావేశానికి కలెక్టర్ నాగరాణి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మండలంలో వనరుల ఆధారిత జీవనోపాధి కార్యక్రమాల్లో సంఘాలు పాల్గొనాలని తెలిపారు. కొబ్బరి అందుబాటులో ఉన్నచోట కొబ్బరి ఆధారిత కార్యక్రమాలు, మత్స్యకారుల ఏరియాలో మత్స్య ఆధారిత కార్యక్రమాలు, కూరగాయాలు పండేచోట కూరగాయాల ఆధారిత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, రక్తహీనత వంటి విషయాల పై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి: ఆర్డీవో



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో అంబరీష్

నరసాపురం టౌన్, జూలై 15: ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన ప్రతి అర్జీని అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో అంబరీష్ ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆయన 21 వినతులు స్వీకరించారు. అర్జీని స్థానికంగా పరిష్కరించకపోవడం వల్ల మళ్లీ మళ్లీ సమస్యలు అవే వస్తున్నాయన్నారు. కావున అర్జీదారుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఎందుకు అవ్వలేదన్న విషయాన్ని ఫిర్యాదుదారులకు తెలియజేయాలన్నారు. సమస్యను పరిష్కరిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

31న బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసాపురం, జూలై 15: నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 31న కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసఫ్ తెలిపారు. 19, 20 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు న్యాయవాదుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 22న స్క్రూటీనీ, 24, 25న నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవచ్చునన్నారు. 31న ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు అసోసియేషన్ ఎన్నికలు జరుగుతాయన్నారు. అదే రోజున 5గంటలకు కౌంటింగ్ ఉంటుందని తెలిపారు.

బీసీలకు న్యాయం జరిగేలా చూడాలి



మంత్రి కవితను కలసిన కొప్పాడ రవి

నరసాపురం టౌన్, జూలై 15: బాధ్యతలు చేపట్టిన బీసీ సంక్షేమశాఖ మంత్రి కవితను సోమవారం రాష్ట్ర అగ్నికులక్షత్రీయ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవి అమరావతిలో ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించారు. గత ప్రభుత్వంలో బీసీలకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. ఇప్పుడు కూటమి రావడంతో రాష్ట్రంలో 144 బీసీ కులస్థులకు న్యాయం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు, రుణాలు మంజూరు చేసి బీసీలకు ఆర్థిక భరోసా కల్పించాలని మంత్రికి విన్నవించినట్లు రవి తెలిపారు.

తూడు, డెక్క తొలగింపునకు నిధులు

నరసాపురం రూరల్, జూలై 15: పంట కాల్వల్లో పేరుకుపోయిన తూడు, డెక్క తొలగింపు పనులకు ప్రభుత్వం రూ.28లక్షలు మంజూరు చేసినట్లు ఇరిగేషన్ ఏఈ మోహన్ తెలిపారు. డివిజన్‌లోని మార్టేరు నుంచి మొగల్తూరు పంట కాల్వ చివరి వరకు ఉన్న తూడు, డెక్క తొలగింపు పనులు చేపడుతున్నామన్నారు. దీంతో పాటు రామన్నపాలెం కాల్వతో పాటు దానికి అనుసంధానం ఉన్న 14చానల్స్‌లో కూడా గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం: తహసీల్దార్



గణపవరం, జూలై 15: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని తహసీల్దార్ రాంబాబు అన్నారు. గణపవరం తహసీల్దార్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్ సీడీపీవో సత్యవతి మాట్లాడుతూ వీఆర్వోలు, పంచాయతీరాజ్ ప్రజా ప్రతినిధులు తల్లిదండ్రులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంఈవో పి.శేషు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు నిడమర్తి కేశవమూర్తి, డీటీ పోతురాజు పాల్గొన్నారు.

నేడు పెనుమంట్ర మండల సమావేశం

పెనుమంట్ర, జూలై 15 : ఈనెల 16వ తేదీన పెనుమంట్ర మండలం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. మండలం ప్రజా పరిషత్ అధ్యక్షుడు కర్రీ వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) అధ్యక్షతన ఈ సమావేశం నిర్వ హిస్తున్నామని తెలిపారు.

చైతన్య స్ఫూర్తి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్



భీమవరం అర్బన్, జూలై 15: స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టంలో మహిళల్లో చైతన్య స్ఫూర్తిని రగిలించిన సంఘసంస్కర్త దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అని త్యాగరాజ భక్త సభ నిర్వాహకులు చెరుకువాడ వెంకట్రామ్య అన్నారు. విజ్ఞాన వేదిక అధ్యక్షులు అల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుర్గబాయ్ దేశ్‌ముఖ్ జయంతి కార్యక్రమం 18వ వార్డులో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి అనంతరం పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి జాగృతి ఇంటర్నేషన్ క్లబ్ భీమవరం అధ్యక్షులు పర్రిపాటి శ్రీను, ఉప్పల నరసింహమూర్తి పాల్గొన్నారు.

భీమవరం టౌన్: ఆదర్శ మహిళ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అని, స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ అనుచరురాలిగా గాంధీజీ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారని ఇన్నర్ వీల్ క్లబ్ ప్రాజెక్టు కన్వీనర్ గంధం శ్రీదేవి అన్నారు. జిల్లా సర్వోదయమండలి ఆధ్వర్యంలో పీఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలలో నలుగురు మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఆమె మాట్లాడుతూ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ రాజమండ్రిలో రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారని, 1931నుంచి 1933 వరకు మూడు పర్యాయాలు బ్రిటీష్ వారు అరెస్టు చేశారని అన్నారు. కే మాధవిలత, చిట్టి కుమారి, సునీత మాట్లాడారు. జిల్లా సర్వోదయ మండలి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి త్వరలో జిల్లాలోని మహిళా సంఘాలను ఎంపిక చేసి దుర్గా బాయ్ పేరిట అవార్డులు అందిస్తామని చెప్పారు. గంధం శ్రీదేవి, ఉపాధ్యాయులు మాధ విలత, సునీత, వారణాసి రాధాకృష్ణ లను అరసవల్లి చారిటబుల్ ట్రస్టుసహకారంతోసత్కరించారు. ఈకార్యక్రమంలో. అరసవల్లి సుబ్రమణ్యం, కలిగోట్ల గోపాల శర్మ, నరహరిశెట్టి కృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ పాలకోడేరు కార్యవర్గం



అధ్యక్షునిగా ఎన్నికైన పాలేశ్వరరావు

పాలకోడేరు, జూలై 15: లయన్స్‌క్లబ్ ఆఫ్ పాలకోడేరు అధ్యక్షునిగా కోరుకొల్లు గ్రామానికి చెందిన సన్నిది పాలేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలకోడేరు గ్రామంలో ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ పాపారావు నాయుడు అధ్యక్షతన కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా పాలేశ్వరరావు, కార్యదర్శిగా గోసెల్ల పురుషోత్తం, ట్రెజరర్‌గా రత్నం, మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు.

అభాగ్యులకు సేవ భగవత్ సేవతో సమానం



అల్లు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న గరికపాటి

భీమవరం అర్బన్, జూలై 15: నిరాదరణకు గురైన వృద్ధులు, అభాగ్యులు, పేద రోగులకు చేతనైన సహాయం అందించ డం భగవత్ సేవతో సమానమని సహస్రావధాని, పద్మశ్రీ డా. గరికపాటి నరసింహారావు అన్నారు. భీమవరం ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో శ్రవణ కుమారుని కథపై ప్రవచనం చేసిన గరికపాటి సేవా రంగంలో విశిష్ట సేవలుఅందిస్తున్న అల్లు శ్రీనివాస్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బొండా వెంకటేశ్వరరావు, సత్యకిషోర్, సురేష్ చంద్రాజీ పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం విద్యార్థులకు ఉద్యోగాలు

పాలకొల్లు అర్బన్, జూలై 15 : ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీకళాశాల (అటానమస్)లో సోమవారం ఎంఎస్సీ ఆక్వాకల్చర్ 2వ సంవత్సరం విద్యార్థులకు భీమవరానికి చెందిన ఆక్వా జెనిక్స్ ప్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ రాజేశ్వరి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను సీఈవో సలాది గోపి కృష్ణ, విజయా ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీ కృష్ణ అందజేశారు.

డీఎన్ఆర్‌లో వ్యాసరచన పోటీలు

పాలకొల్లు అర్బన్, జూలై 15 : డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ కేంద్రంలో ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం నాంది ఫౌండేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రవి శంకర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



మొగల్తూరు, జూలై 15: మోళ్లపర్రు కనకదుర్గాబీచ్‌లో దశావతార సహిత మత్స్యనారాయణస్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మీ అమ్మవార్ల ఆలయంలో వారాహి నవరాత్రుల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నిత్యార్చన పూజా కార్యక్రమంలో భాగంగా సోమవారం అమ్మవారి సన్నిధిలో నక్షత్ర శాంతి, దుష్ట గ్రహ పీడ నివారణ, కుంకుమ పూజలు నిర్వహించారు.

భీమవరం టౌన్: మెంటేవారితోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా సోమవారం సంప్రదాయ బద్ధంగా వారాహి హోమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో యామిజాల కృష్ణ శర్మ ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్‌లచే అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వారాహి నవరాత్రులు ముగింపు సందర్భంగా వేద మంత్రాలతో వారాహి హోమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని హోమాన్ని దర్శించుకున్నారు.

మావుళ్ళమ్మకు ఆషాఢ సారె



భీమవరం టౌన్, జూలై 15: ఆషాఢమాసం పురస్కరించుకుని మావుళ్ళమ్మవారికి పట్టణానికి చెందిన కొప్పనర్తి ప్రభాకర్ రెడ్డి, శ్రీవాణి దంపతులు సారె సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో పాటు పలురకాల స్వీట్లు, పండ్లు, పట్టుచీర, గాజులతో అమ్మవారికి సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అందించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి సారెను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. దంపతులకు ఆశీర్వదించారు. దేవస్థానం తరుపున శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అందజేశారు.

లెప్రసీ కేసులను గుర్తించాలి

మొగల్తూరు, జూలై 15: లెప్రసీ కేసులను గుర్తించేందుకు సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించాలని వైద్యులు దినేష్, లక్ష్మీపార్వతి ఆదేశించారు. సోమవారం మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆశ, ఏఎన్‌ఎంల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 18 నుంచి ఆగస్టు ఆరవ తేదీ వరకు ఆశ వర్కర్లు ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. రాగి రంగులో ఉండి స్పర్శలేని మచ్చలు ఉన్నవారిని గుర్తించి ఆసుపత్రికి వచ్చేలా చూడాలన్నారు. ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించి లెప్రసీగా గుర్తిస్తే తగిన నివారణకు మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో జక్కంపూడి రాంప్రసాద్, మాజీ డీపీఎంవో సుధీర్, ఎంపీహెచ్‌వో మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నారుమడి గట్లు బలోపేతం చేయాలి



మొగల్తూరు, జూలై 15: నీట మునిగిన వరి నారు మడులు గట్లు బలోపేతం చేయాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. సోమవారం మండలంలో నీట మునిగిన నారుమడి చేలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడి గట్లను బలోపేతం చేయాలని, ఆకుమడిలోకి నీరు వెళ్ళకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు కారణంగా ఎటువంటి ఎరువులు వేయవద్దని అలా వేసినట్టయితే నారుమడి కుళ్ళిపోయే అవకాశం ఉందన్నారు.

పుట్టిన రోజు వేడుకల్లో విద్యా సామగ్రి పంపిణీ

గణపవరం, జూలై 15 : సమాజ సేవలో బీసీ సంక్షేమ సంఘం సభ్యులు కృషి చేసి ప్రజామన్ననలు పొందాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుమ్మలూరి లోకేశ్వరబాబు అన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శంకరరావు జన్మదినం సందర్భంగా సోమవారం కోమర్రులోని పలు పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, విద్యాసామగ్రి, బిస్కెట్లు తదితర వస్తువులు లోకేశ్వరబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. శంకరరావు బర్తడేకేకు కట్ చేశారు.

కలెక్టర్‌ను కలసిన బీజేపీ నాయకులు

భీమవరం టౌన్, జూలై 15 : జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు, కోమటి రవికు మార్,అల్లూరి సాయిదుర్గారాజు, నియోజకవర్గం కన్వీనర్ కాగిత సురేంద్ర, కూరెళ్ల నర్సింహా రావు, ఆకుల లీలాకృష్ణ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అందించాలి

భీమవరం అర్బన్, జూలై 15: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు డి.కోడేశ్వరరావు, మండ సూరిబాబులు మాట్లాడుతూ పెండింగ్ ఉన్న క్లైములను క్లియర్ చేయాలని, 50సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.